ప్రజాశక్తి
గురువారం 16 అక్టోబరు, 2025



2న తెప్పోత్సవం

ప్రజాశక్తి- అరసవల్లి

ప్రముఖ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవస్థానంలో నవంబరు 2న హంస నావికోత్సవం (తెప్పతిరునాళ్ళు) నిర్వహిస్తున్నట్లు దేవదాయ, ధర్మదాయశాఖ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. క్షీరాబ్ధి, ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ఈ తెప్పోత్సవ కార్యక్రమం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. సూర్యనారాయణ స్వామివారి హంస నావికోత్సవాన్ని దేవస్థానం ఎదురుగా ఉన్న ఇంద్రపుష్కరిణి (కోనేరు)లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎవరి దారి వారిదేనా?

రాజకీయ అవసరాల కోసమో లేక అధికార పీఠం కోసమో సార్వత్రిక ఎన్నికల ముందు జతకట్టిన టిడిపి, జనసేన, బిజెపి పార్టీల చెలిమి ప్రస్తుతం బలహీనంగా పడుతున్నట్లుగా కనిపిస్తోంది. జిల్లా పర్యటనకు వచ్చిన పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పలకరించే వారే కరువయ్యారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన రీజనల్ కాన్ఫరెన్స్‌కు, జెడ్‌పిలో రైతులు, మిల్లర్లతో నిర్వహించిన సమావేశానికి వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో సహా టిడిపి ఎమ్మెల్యేలంతా బహిష్కరించినట్లుగా ఎవరూ రాలేదు. ఉమ్మడి జిల్లా పాలకొండ నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాత్రం హాజరయ్యారు. ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన రీజనల్ కాన్ఫరెన్స్‌కు మంత్రి అచ్చెన్నాయుడుతో సహా టిడిపి ఎమ్మెల్యేలు కట్టకట్టుకుని గైర్హాజరు కావడంపై తీవ్ర చర్చ నడుస్తోంది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి



- పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల సమీక్షకు అచ్చెన్న దూరం
- కర్నూలు పర్యటన పేరుతో ముందు రోజే పయనం
- జిల్లాలో ఉన్నా ఒక్క టిడిపి ఎమ్మెల్యే కూడా హాజరు కాని వైనం
- రీజనల్ కాన్ఫరెన్స్ సాక్షిగా బయటపడ్డ ఆధిపత్యపోరు

ఖరీఫ్‌లో కీలకమైన ధాన్యం కొనుగోలుపై కలెక్టరేట్‌లో ఈ నెల 13న నిర్వహించిన రీజనల్ కాన్ఫరెన్స్‌కు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రాకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ధాన్యం కొనుగోలుకు సంబంధించి వ్యవసాయశాఖ పాత్రే కీలకం. ఆ శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి లేకపోవడం సమీక్షలో ఆ లోటు స్పష్టంగా కనిపించింది. జిల్లాలో ప్రతి ఏడాదీ ధాన్యం కొనుగోలులో రైతులు పడుతున్న అవస్థలపై బాగా అవగాహన ఉన్న నేపథ్యంలో మంత్రి అచ్చెన్నాయుడి సలహాలు, సూచనలు ధాన్యం కొనుగోలుకు దోహదపడేవి. ఆయనకు ఉన్న అపార అనుభవంతో అధికారులకు దిశా నిర్దేశం చేసేవారు. కానీ, మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటన ముందు రోజు వరకు నిమ్మాడలో వినతులు స్వీకరించిన మంత్రి అచ్చెన్నాయుడు ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్లు చూడాలనే పేరుతో 12 సాయంత్రం ఆయన పయనమయ్యారు. అయితే మంత్రి అచ్చెన్నాయుడు మాత్రం 13న కర్నూలుకు వెళ్లలేదని తెలిసింది. కర్నూలు పర్యటన కోసం మంగళవారం వెళ్లారు. దీనిపై జనసేన నాయకుల్లో విస్తృత చర్చ నడుస్తోంది. తమ నేత సమీక్షకు కావాలనే ఉద్దేశపూర్వకంగానే గైర్హాజరయ్యారా? లేక కర్నూలు పర్యటన పేరుతో దూరంగా ఉన్నారా? అని చర్చించుకుంటున్నారు.

ఒక్క టిడిపి ఎమ్మెల్యే హాజరు కాని వైనం

టిడిపి ఎమ్మెల్యేలంతా జిల్లాలోనే ఉన్నా మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్షకు మాత్రం రాలేదు. నియోజకవర్గంలోని వివిధ కార్యక్రమాలకు మాత్రం సమయం వెచ్చించారు. ధాన్యం కొనుగోలు సందర్భంలో రైతులూ ఏటా ఇబ్బందులు అవస్థలు పడుతునే ఉన్నారు. ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడంతో తమ నియోజకవర్గంలోని రైతాంగం సమస్యలను పౌర సరఫరాల మంత్రి దృష్టికి తీసుకువెళ్లే అవకాశం లేకుండాపోయింది. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ జిల్లాలోనే ఉన్నారు. కవిటి మండలం రామయ్యపుట్టుగలోని క్యాంప్ కార్యాలయంలో కార్యకర్తలను కలుసుకోవడంతో పాటు సోంపేటలోని ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ జిల్లా కేంద్రంలోనే ఉన్నా సమావేశానికి రాలేదు. సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్ వారోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు ఆయన హాజరయ్యారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆమదాలవలసలోని క్యాంప్ కార్యాలయంలో కార్యకర్తలను కలుసుకున్నారు. మధ్యాహ్నం సరుబుజ్జిలి మండల సమావేశానికి హాజరయ్యారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పలాసలో జిఎస్‌టి 2.0 అవగాహనపై ర్యాలీ, మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి జలుమూరు మండలం చల్లపేటలో పౌష్టికాహార మహోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు తన సొంత గ్రామం నడుకుదుటిపాలెంలోని క్యాంప్ కార్యాలయంలో కార్యకర్తలు కలుసుకునేందుకు సమయం వెచ్చించిన ఆయన సమీక్షకు మాత్రం డుమ్మా కొట్టారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాతపట్నంలో నిర్వహించిన కళింగ వైశ్య సంక్షేమ సంఘ సమావేశంలో పాల్గొన్న ఆయన ధాన్యం కొనుగోలు సమావేశానికి సమయం కేటాయించకపోవడం గమనార్హం.

గైర్హాజరు వెనుక కారణమేమిటో!

సమీక్షా సమావేశాల విషయంలో కూటమి ఎమ్మెల్యేలు వ్యహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టరేట్‌లో మంత్రి అచ్చెన్నాయుడు స్వయంగా చేపట్టిన సమీక్షలకు దాదాపు ఎమ్మెల్యేలంతా హాజరవుతున్న పరిస్థితి చాలా సందర్భాల్లో ఉంది. గతంలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడుతో సహా ఎమ్మెల్యేలు, బిజెపి ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు కూడా పాల్గొనడం గమనార్హం. మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్షకు మాత్రం అంతా గైర్హాజరు కావడం వెనుక కారణమేమైంటుందన్న చర్చ నడుస్తోంది.

కూటమి పార్టీల్లో అనైక్యతా రాగాలు

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో సహా ఎమ్మెల్యేలంతా సమీక్షకు డుమ్మా కొట్టడం ద్వారా కూటమిలో నెలకొన్న అనైక్యత బయటపడినట్లయింది. అంతా కలిసి ఉన్నామని బయటకు చెప్తున్నా, ఎవరి దారి వారు చూసుకుంటున్నట్లుగా కనిపిస్తోంది. అందులో భాగంగానే టిడిపి నేతలు జనసేనకు చెందిన నాదెండ్ల మనోహర్ సమీక్షకు హాజరు కాలేదనే చర్చ నడుస్తోంది. మరోవైపు జనసేన కూడా వారికి తగ్గట్టుగానే వ్యవహరిస్తోంది. పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌కు స్వాగతం పలుకుతూ జిల్లా కేంద్రంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో మంత్రి అచ్చెన్నాయుడు ఫొటోనూ ఎక్కడ వాడలేదు. రాబోవు రోజుల్లో వీరి మధ్య పొరపొచ్చాలు ఈ స్థాయికి వెళ్తాయోనన్న చర్చ జిల్లాలో నడుస్తోంది.



మాట్లాడుతున్న గోవిందరావు

హామీల అమలుకు పోరుబాట

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రపజాశక్తి- టెక్కలిరూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు జిల్లాకి ఇచ్చిన ఏఒక్క హామీ అమలు కాలేదని, హామీల అమలుకు పోరుబాట తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు స్పష్టం చేశారు. సిపిఎం కార్యాలయంలో మండల నాయకులు కొల్లి ఎల్లయ్య అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు జిల్లాకు ఇచ్చిన హామీలను ఎప్పటిలోగా అమలు చేస్తారని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని, జీడికి గిట్టుబాటు ధర కల్పిస్తామని, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని, జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి శివారు భూముల వరకు నీరుస్తామని, నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని విమర్శించారు. టెక్కలిలో 200 పడకల ఆస్పత్రి గామార్చుతామని ఇచ్చిన హామీ అమలు కాలేదు. ఆస్పత్రిలో సిబ్బంది, మందులు కొరత తీవ్రంగా ఉందన్నారు. ఇప్పటికీ రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లాలో ఐటిడిఎ లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన భూములపై తప్పుడు పత్రాలు సృష్టించి గిరిజన ఏతలు ఆక్రమించుకుంటున్నారని, ప్రభుత్వ నిమ్మకనీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి శివారు భూముల వరకు నీరిస్తే జిల్లా సస్యశ్యామలమవుతుందని అన్నారు. కానీ, కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉందని అన్నారు. 2007లో ప్రారంభించిన ఆఫ్‌షోర్ రిజర్వాయరు పూర్తి కాలేదన్నారు. ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయించి నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టెక్కలి మండలంలో లింగాలవలస పంచాయతీ మేఘవరం పంచాయతీలకు సరియాపల్లి రిజర్వాయరు, మొఖలింగాపురం పంచాయతీ దుర్గ గెడ్డపైన చెరువు నిర్మించాలని డిమాండ్ చేశారు. కోటబొమ్మాళి మండలం కొండపేట ఎత్తిపోతల పథకాన్ని మరమ్మతులు చేసి నీరు ఇవ్వాలన్నారు. చింతామణి భూములకు కొత్త చెరువు మీదుగా నీరు అందించేందుకు పోలవరం ఎత్తిపోతల పథకం స్థాయిని పెంచాలన్నారు. టెక్కలి రెవెన్యూ డివిజన్‌లో చేర్చిన కొత్తూరు మండలం నుంచి నేరుగా ఆర్‌టిసి బస్సులు వేయాలన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు హెచ్.ఈశ్వరరావు, పి.సాంబమూర్తి, బగాది వాసుదేవరావు, ఉర్జాన లక్షణరావు, బొంతు ధర్మారావు పాల్గొన్నారు.

26న జిల్లాస్థాయి చదరంగం పోటీలు

టెక్కలి : ఆల్‌ఇండియా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 26న స్థానిక అల్వాజెన్ స్కూల్‌లో జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహించామని అసోసియేషన్ నిర్వాహకులు సనపల భీమారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు జిల్లాలో అన్ని పాఠశాలల నుంచి క్రీడాకారులు హాజరు కావచ్చునని తెలిపారు. ప్రవేశ రుసుం రూ.300 చెల్లించి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఉదయం 9-30 నిమిషాలకు పోటీలు ప్రారంభమవుతాయని అన్నారు. విజేతలకు రూ.పది వేలు నగదు పురస్కారంతో పాటు ధ్రువపత్రం అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9912559735 నంబరును సంప్రదించాలని కోరారు.

డిసెంబరు నాటికి ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పూర్తి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనాన్ని డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలన్నీ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌లోనే ఉండాల న్నారు. ఒక్కో శాఖకు ఎన్ని స్క్వేర్ ఫీట్ అవసరం ఉంటుందన్నారు. ఆ శాఖ కేడర్ స్ట్రెంత్‌కు అవసరాన్ని చూసి కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలతో ఎక్కువ సంబంధం ఉన్న శాఖలను కింది ఫ్లోర్‌లోనే ఉండేటట్లు చూడాలన్నారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ అన్ని ఫ్లోర్లలోని గదులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులతో చర్చించారు. స్టాఫ్ క్యాంటీన్‌కు కేటాయించిన గదిని పరిశీలించారు. ప్రవేశ ద్వారం ఎప్పటికి పూర్తి అవుతుందని అధికారులను అడిగారు. ఈ నెలాఖరులోగా పూర్తి అవుతుందని కాంట్రాక్టరు శ్రీరామ్ వివరించారు. ప్రవేశ ద్వారానికి సంబంధించి ఎలివేషన్ తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. కాలువల ద్వారా వచ్చే నీరు ఎటువైపు వెలుతుందని అడిగారు. నీరు ఎక్కడా నిలువ ఉండరాదన్నారు. ప్రవేశ ద్వారానికి ముందు భాగంలో ఐలాండ్ వలే ఏర్పాటు చేసి మొక్కలు నాటాలని చెప్పారు. డ్రైనేజీపై వేయబోయే టైల్స్, కాంపౌండ్ వాల్ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రవేశ ద్వారంలో వాహనాలు, ప్రజలు నడిచి వెళ్లే మార్గాలు వేర్వేరుగా ఉండాలన్నారు. పార్కింగ్ స్థలం కేటాయింపు సామర్థ్యం మేరకు ఉండాలని అన్నారు. ప్రవేశ ద్వారం నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంపై సుదీర్ఘంగా పరిశీలించి చర్చించారు. బయట చిన్న షాప్స్ పెట్టుకునే విధంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంట్రన్స్ డోర్ పెద్దదిగా ఉండాలన్నారు, ఎంట్రన్స్‌లో పెద్ద గోడలపై పెయింటింగ్ వేయాలని చెప్పారు. లోపల వైపు ఉన్న లాన్‌లో నీరు నిల్వ ఉండరాదన్నారు. వెనుకవైపు పార్క్, ఆటలు ఆడుకొనేందుకు వీలుగా తీర్చిదిద్దాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ పి.సత్యనారాయణ, ఆర్‌అండ్‌బి ఇఇ ఎ.తిరుపతిరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ. సూర్యనారాయణ పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మహిళా పోలీసుల విధులు కీలకం

ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రతి మహిళా పోలీసు మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారించాలని, రానున్న ఎన్నికల దృష్ట్యా క్షేత్రస్థాయిలో గ్రామాల సమాచారంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. నగరంలోని స్థానిక బృందావన్ ఫంక్షన్ హాల్లో బుధవారం శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళా భద్రత, చైల్డ్ వెల్ఫేర్, మాదక ద్రవ్యాలు నియంత్రణ, శక్తి యాప్, సైబర్ సేఫ్టీ, రాబోయే స్థానిక ఎన్నికల్లో విధినిర్వహణ ప్రణాళిక అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమాచార సేకరణలో ముందుండాలన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో మహిళా సంరక్షణ కార్యదర్శులు ప్రజలతో నిరంతరం సన్నిహితంగా ఉండడం, గ్రామాలు, వార్డుల్లో ప్రజలకు దగ్గరగా ఉంటూ పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. విధులు నిర్వర్తించే మహిళా సంరక్షణ కార్యదర్శులు పోలీసుశాఖకు గ్రామస్థాయి ప్రతినిధులుగా వ్యవహరించాలన్నారు. మహిళలు, పిల్లలు ఎదుర్కొనే సమస్యలు, వివాదాలు, కుటుంబ కలహాలు, వేధింపులు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల, పంచాయతీ ఎన్నికల సమయంలో, గ్రామాలు, వార్డుల్లో మహిళా సంరక్షణ కార్యదర్శులు ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రత పరిరక్షణలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రతి మహిళా పోలీసు పరిధిలో పోలింగ్ స్టేషన్, ఓటర్ల సంఖ్య, గ్రామంలో విఆర్ఒ, బిఎల్ఒ, దత్తత కానిస్టేబుల్ సమన్వయంతో ముందుకు సాగాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ డి.సత్యనారాయణ, డిఎస్‌పి సిహెచ్ వివేకానంద, సబ్ డివిజన్ పరిధిలోని మండల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి



లోగోను ఆవిష్కరిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

సిక్కోలు పుస్తక మహోత్సవం

లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి- అరసవల్లి

శ్రీకాకుళం ఏడో రోడ్ల కూడలి దరి మున్సిపల్ మైదానంలో నవంబరు 11 నుంచి 20 వరకు నిర్వహించనున్న సిక్కోలు పుస్తక మహోత్సవం సాహిత్య సాంస్కృతిక వైజ్ఞానిక సంబరాలు విజయవంతం కావాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆకాంక్షించారు. తన ఛారంబర్‌లో సికోలు పుస్తక మహోత్సవం లోగోను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇటువంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని అన్నారు.మహోత్సవం కన్వీనర్ కె.శ్రీనివాసు, సాంస్కృతిక వైజ్ఞానిక కన్వీనర్లు పి.సుధాకరరావు, గొంటి గిరిధర్‌లు మాట్లాడుతూ సంబరాలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే సాహిత్య కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనల షెడ్యూలు తయారైందని వివరించారు. కళాశాలలు, స్కూళ్ల విద్యార్థులకు వివిధ అంశాల్లో ఈ నెలాఖరులోగా పోటీలు నిర్వహణ ఉంటుందని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే సహకరిస్తుందని, ముమ్ముందు దీన్ని మరింత ముందుకు కొనసాగించాలని అన్నారు. జిల్లాకు చెందిన వివిధ రంగాల్లోని ప్రముఖులు స్కూళ్లు, కళాశాలల యాజమాన్యాలు పారిశ్రామికవేత్తలు సహకారం అందించాలని కోరారు. ప్రజలంతా ఆ పది రోజులు ఆటవిడుపుగా సందర్శించేందుకు ఈ మహోత్సవం సర్వాంగ సుందరంగా సన్నద్ధం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ కామినాయుడు, దొంతం పార్వతీశం, కె.కూర్మారావు, పి.గోవిందరావు, గొంటి గిరిధర్, పి.సుధాకర్, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ కుట్రలను తిప్పికొడదాం

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

ప్రజాశక్తి- బూర్జ

మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టామని, దీంతో కుటమి ప్రభుత్వ కుట్రలను తిప్పికొడదామని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. మండలంలోని అల్లిన, డొంకలపర్త గ్రామాల్లో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య వైద్య రంగాలను ప్రైవేటు యాజమాన్యం కిందకు తీసుకువెళ్లి పేద విద్యార్థుల పేదల జీవితాలతో చెలగాటం ఆడేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాన్ని ప్రజా పోరాటంతోనే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. అనాలోచితంగా ఈ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్కార్ మెడలో నుంచి దాన్ని ఉపసంహరించే వరకు వెనకడుగు వేయబమని స్పష్టం చేశారు. ప్రతి పేదవాడికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలన్న గొప్ప లక్ష్యంతో నాటి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అందులో ఏడు కాలేజీలను పూర్తి చేశారన్నారు. రూ.500 కోట్ల నిర్మాణంతో 50 ఎకరాలు విత్తనంలో మెడికల్ కాలేజ్‌తో పాటు టీచింగ్ ఆస్పత్రులను నిర్మించారని అన్నారు. ఎ,బి,సి మూడు కేటగిరిలో ఫీజు నిర్ణయించి 50 శాతం సీట్లకు కేవలం రూ.15 వేలు ఫీజు మాత్రమే నిర్ణయించారన్నారు. నిధుల కొరత కారణంగా ఆస్పత్రి నిర్వహణ ఇబ్బందులు రాకూడదని ఉద్దేశంతో 15 శాతం సీట్లను ఎన్నారై కోటా కింద పూర్తి చేశామన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల ఫీజులు దోపిడిని అడ్డుకట్టు వేయడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, వైసిపి మండల అధ్యఓఉలు ఖండాపు గోవిందరావు, వైసిపి పంచాయతీరాజ్ విభాగ జాయింట్ సెక్రటరీ వి.మురళీకృష్ణ, పంచాయతీరాజ్ సోషల్ మీడియా విభాగ జాయింట్ సెక్రెటరీ బి.వెంకట్‌సత్యం, అల్లెన సర్పంచ్ ప్రతినిధి జడ్డు మహేశ్వరరావు, వైసిపి నాయకులు జడ్డు రామానంద్ పాల్గొన్నారు.



సంతకాలను సేకరిస్తున్న వైసిపి నాయకులు



మాట్లాడుతున్న విప్ అశోక్

భవిష్యత్ టెక్ రాజధాని విశాఖ

ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

ఇప్పటికే విశాఖ నగరం ఐటీ హబ్‌గా గుర్తింపు పొందిందని, రాబోయే రోజుల్లో హైదరాబాద్‌ను మించిపోయే టెక్ నగరంగా మారుతుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గూగుల్ సంస్థ విశాఖలో రూ.87,500 కోట్లు పెట్టుబడులు పెట్టి సౌత్ ఎషియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ల క్లస్టర్లు నిర్మించబోతోందని అన్నారు. ఇది రాష్ట్రాభివృద్ధిలో ఓ మైలురాయిలా నిలవబోతుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఇదే విశాఖ గుండెకాయ అవుతుందని తెలిపారు.

చంద్రబాబు నాయుడు హయాంలోనే మొదలైన ఐటీ ప్రయాణం ఇప్పుడు కొత్త దశలోకి అడుగుపెడుతోందని చెప్పారు. యువతకు విశాఖ కొత్త సిలికాన్ వ్యాలీ అవుతుందని హామీ ఇచ్చారు. రాజకీయాలు పక్కనపెట్టి విశాఖను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడం మా సంకల్పమని అన్నారు. భూముల కేటాయింపు నుంచి టవర్ నిర్మాణం వరకు ఫాస్ట్ ట్రాక్‌లో నిర్ణయాలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రాష్ట్ర ఐటి రంగాన్ని అభివృద్ధి చేసి లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా మంత్రి నారా లోకేష్, కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్, మత్స్యకార నాయకుడు గంతి శ్రీను, కాయ పురుషోత్తం, రామయ్య, తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఉద్రిక్తత

పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ మంత్రి నిరసన

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ న్యూ కాలనీకి చెందిన వైసిపి కార్యకర్త పైల వేణుగోపాల్‌రెడ్డిపై కాశీబుగ్గ పోలీసులు అక్రమ కేసు పెట్టారని ఆరోపణతో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు తన అనుచరులు, వైసిపి నాయకులతో కలిసి మంగళవారం అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఈ సమయంలో పోలీసులకు వైసిపి నాయకులకు మధ్య జరిగిన వాగ్వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ వివాదం అర్ధరాత్రి వరకు హైడ్రామాగా కొనసాగింది. నకిలీ మద్యం, అక్రమ వసూళ్లపై సోమవారం కాశీబుగ్గ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట వైసిపి చేపట్టిన నిరసన ర్యాలీలో ఒక మహిళా కానిస్టేబుల్‌పై వేణుగోపాల్ రెడ్డి అనుచితంగా ప్రవర్తించాడంటూ పోలీసులు అక్రమ కేసు పెట్టారని అప్పలరాజు ఆరోపించారు. అనంతరం మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ చర్చలకు ఆహ్వానించారు. పోలీసులతో మాజీ మంత్రి సీదిరి జరిపిన చర్చలు విఫలమయ్యాయి. అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల సమయంలో పోలీసులు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు నచ్చ జెప్పడంతో నిరసన విరమించారు.

విలేకరులపై చిందులు

కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వైసిపి నాయకులు పోలీసులు మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో వార్తలు సేకరించేందుకు వెళ్లిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులపై పోలీసులు చిందులేశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారిధిగా ఉన్న మీడియాపై అక్కసుతో పోలీసులు స్టేషన్ లోపలికి అనుమతించకపోవడంతో తమను తీరని అవమానం జరిగిందంటూ మీడియా ప్రతినిధులంతా స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు.



నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు


పోస్టర్లతో విద్యుత్ ఉద్యోగులు

రేపట్నుంచి సమ్మె

పొందూరు: ఈ నెల 17 నుంచి జరిగే సమ్మెలో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ పిలుపులో భాగంగా విద్యుత్ ఉద్యోగుల పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. విద్యుత్ ఉద్యోగుల సమ్మె జయప్రదానికి పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అన్ లిమిటెడ్ వైద్య సదుపాయం, రూ.కోటి ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, జెఎల్ఎం గ్రేడ్-2 వారికి సర్వీసు రూల్స్, ఉద్యోగుల డిఎలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, కార్మికులు, ప్రజా శ్రేయస్సు, సమస్యల పరిష్కారమయ్యే వరకు, ప్రైవేటీకరణ విధానాల నుంచి సంస్థను రక్షించుకోవాలని, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే బిల్లుకు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పేడాడ అప్పల నాయుడు, విద్యుత్ ఉద్యోగులు కె.రమేష్, వి.సుధీర్, కె.సురేష్, డి.సంతోష్ కుమార్, ఎల్.హరి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను ముంచేశారు...

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

బూర్జ: అన్నదాతను నిండా ముంచిన ఘనత కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ ఎద్దేవా చేశారు. మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు సేకరణ కార్యక్రమం చేపడుతున్న సందర్భంగా మండలంలోని అల్లినలో విలేకరులతో మాట్లాడారు. రైతులకు రూ.20 వేలు భరోసా కల్పిస్తామని ప్రకటించినప్పటికీ ఇంతవరకు ఆచరణ రూపం దాల్చలేదన్నారు. అంతే కాకుండా ఎన్నికల సమయంలో కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మాయచేసి అధికారం చేజిక్కించుకున్న చంద్రబాబు నాయుడు ఆ హామీలను తుంగలో తొక్కారన్నారు. ఈ 16 నెలల్లో అభివృద్ధి కార్యక్రమాలను పక్కనపెట్టి ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారన్నారు. ముఖ్యంగా మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసి కార్పొరేటర్ సంస్థలకు కొమ్ముకాసేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు స్వస్తిపలికి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. లేనిపక్షంలో తమ పార్టీ తరఫున ప్రభుత్వాన్ని ఎండగడతామని హెచ్చరించారు.


వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్ రౌళో

పనులు ప్రారంభించాలని వినతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ ఉత్తర ఆర్‌యుబి పనులు ప్రారంభించాలని జెడ్ఆర్‌యుసిసి సభ్యులు శ్రీనివాస్ రౌళో కోరారు. ఈ మేరకు కుర్దా రైల్వే డివిజనల్ మేనేజర్ అలోక్ త్రిపాఠిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తర కేబిన్ వైపు ట్రాఫిక్ సమస్య చాలా తీవ్రంగా ఉందన్నారు. వాహనదారులు, పాదారులు గేటు వేసిన తరువాత గంటలు తరబడి నిరీక్షించాల్సి వస్తోందన్నారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్‌తో పనులు త్వరగతిన చేయించాలని కోరారు. అలాగే సోంపేట, జాడపూడి, బారువ, మందస రైల్వేస్టేషన్ల రైలు హాల్ట్ గురించి వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సదానందరౌళో, బుగత వాసు పాల్గొన్నారు.


ఎంపిక పత్రాలను అందజేస్తున్న ఎన్‌సిసి అధికారులు

'ఐతమ్'లో ఎన్‌సిసి ఎంపికలు

టెక్కలి రూరల్ : టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం, ఎల్ఇ విద్యార్థులకు జాతీయ కేడెట్ దళం ఎన్‌సిసి ఎంపిక కార్యక్రమం బుధవారం నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరావు తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమం 14 ఆంధ్రబెటాలియన్, కమెండెంట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ శాంక్ కుశ్వహ్, సుబెదర్ మేజర్ బల్వంత్ సింగ్,సుబెదర్ బగిచాసింగ్, సిహెచ్ఎం రవికృష్ణ, హావల్దర్ అన్నం ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యాన నిర్వహించామన్నారు. దేశభక్తి, శారీరక ధృఢత్వం, నాయకత్వ గుణాలు, సామాజిక సేవాభావం పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. 380 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా, 77 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఎన్‌సిసి కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, టి.మురళీమోహనరావు, అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్, శిక్షణాధికారులు ఎన్.భుజంగారావు, ఎస్.రామయ్య పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మందస, వజ్రపుకొత్తూరు మండలాల సచివాలయం ఉద్యోగులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులంతా ప్రజలకు అందుబాటులో ఉండి వారికి ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. మీ పరిధిలో కాకుండా ఉండే సమస్య అయితే ఎక్కడ పరిష్కారం అవుతుందో వారికి సామరస్యంగా వివరించాలన్నారు. ప్రజాప్రతినిధులు ఏ పార్టీకి చెందిన వారైనా అందరికి సమాచారం అందించి ముఖ్యంగా ప్రొటోకాల్ పాటించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పంచాయితీ రాజ్ శాఖకు ఎక్కువ శాతం నిధులు కేటాయించి రోడ్లు, కాలువలు వంటి అభివృద్ధి చేపట్టామని అన్నారు. ఉద్యోగులు ప్రజలు ఫిర్యాదులు పరిష్కరించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, వజ్రపుకొత్తూరు ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు, భావన దుర్యోధన పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి అందజేత

వజ్రపుకొత్తూరు మండలం బాతుపురానికి చెందిన బత్తిని కిషోర్ కుటుంబ సభ్యులకు సిఎం సహాయ నిధి నుంచి రూ.3 లక్షలు చెక్కును ఎమ్మెల్యే అంతజేశారు. కొంతకాలం క్రితం కిషోర్ హైదరాబాద్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని స్థానిక టిడిపి నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరుకు కృషి చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు బత్తిని మోహనరావు, యూనిట్ ఇన్‌ఛార్జి తామాడ ప్రదీప్, తెప్పల సింహాచలం, బాతుపురం గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు రెయ్య ప్రభాకర్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి- పలాస

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యాన పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిపిఆర్ (గుండె, ఊపిరితిత్తుల పున్ణప్రారంభన)పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇందులో సొసైటీ జిల్లా శాఖ మేనేజర్ కె.సత్యనారాయణ మాట్లాడుతూ ఆపత్కర పరిస్థితుల్లో శ్వాస కోల్పోయిన సమయంలో కృత్రిమ శ్వాస ఇచ్చి కాపాడే విధానాన్ని సిపిఆర్ అంటారని అన్నారు. ఇలాంటి స్థితిలో ఆ వ్యక్తికి సరిపోయిన ఆక్సిజన్‌ను కృత్రిమంగా నోటి నుంచి నోటికి అందివ్వాలన్నారు. అలాగే ఛాతిపై నిమిషానికి వంద నుంచి 120 సార్లు ఒత్తిడిని కలిగించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.నరసింహమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవరావు, తమ్మినాన పాపారావు, అధ్యాపకులు యుగంధర్, ప్రసాదరావు, సరస్వతి పాల్గొన్నారు. అలాగే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యాన ప్రభుత్వ జూనియర్, కాశీబుగ్గ సూర్యతేజ కళాశాలల్లో సిపిఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ జిల్లా శాఖ మేనేజర్ కె.సత్య నారాయణ, సూర్యతేజ కళాశాల ప్రిన్సిపాల్ దానేటి పద్మాజీ కామేశ్వరరావు, ఎపిఒ ఎస్.ఉమాశంకర్, ప్రిన్సిపాల్ కె.నర సింహమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవరావు, పాపారావు, అధ్యాపకులు యుగంధర్, ప్రసాదరావు, సరస్వతి పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులు వేగవంతం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జల జీవన్ మీషన్ పనులు వేగతంతం చేసి, ఇంటింటికీ తాగునీరు ఇచ్చే చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 4,87,307 ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 2,29,649 కనెక్షన్లు పూర్తయ్యాయని అన్నారు. ఇంకా 2,57,658 కనెక్షన్లు పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. పనుల పురోగతి సంతృప్తికరంగా ఉన్నప్పటికీ, మిగిలిన లక్ష్యాన్ని చేరుకోవడానికి మండలాల వారీగా కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని సూచించారు. మొత్తం 4,286 పనులకు అనుమతి లభించగా, ఇప్పటివరకు 1,912 పనులు భౌతికంగా పూర్తయ్యాయి. పెండింగ్‌లో ఉన్న టెండర్ పనుల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే, శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులో ఉంచడం


సమీక్షిస్తున్న కలెక్టర్ ర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ద్వారా గ్రామీణ ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, అన్నారు. ఇది జీవన నాణ్యత పెరగడానికి దోహదపడుతుందని కలెక్టర్ గుర్తు చేశారు. అధికారులు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, పనులను వేగవంతం చేయాలని అన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 29 గ్రామాలు 'హర్ ఘర్ జల్' డిక్లరేషన్ సాధించాయి. డిసెంబరు 2025 నాటికి మరింత మందికి తాగునీరు అందించే లక్ష్యంతో నవంబరు నుంచి మార్చి 2026 వరకు మరో 178 గ్రామాలను డిక్లేర్ చేయడానికి లక్ష్యం పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు. ఈ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించడానికి ప్రతి అధికారీ చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ఎన్‌టిఆర్ కాలనీలో నివశిస్తూ... ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన ప్రధానోగణపతి కుటుంబానికి స్థానికులు ఆర్థికసాయం అందించారు. ఈ మేరకు 22 వేలు నగదును బాధితుడి భార్యకు అందించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ యుగంధర్, శ్రీనివాస్, రాజబాబు, గోపి, ఈశ్వరరావు, కనకరాజు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. దివిస్ లేబొరేటరీస్ ఆధ్వర్యాన నిర్వహించనున్న ఈ జాబ్‌మేళా ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. డిగ్రీలో కెమిస్ట్రీ చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

రోడ్డు నిర్మాణానికి ఆమోదం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

గ్రామ పంచాయతీలో అనుబంధ గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా అనేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు ఎట్టకేలకు మోక్షం కలిగిందని బాలకృష్ణాపురం సర్పంచ్ బోరుభద్ర లోహిదాసు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు చొరవతో రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్లు ఆమోదం వచ్చిందన్నారు. దీనిపై హర్షం వ్యక్తం చేశారు.

సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- అరసవల్లి

జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అదేవిధంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావుచే రూపొందించబడిన 8వ తరగతి ఎన్ఎంఎంఎస్ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్, జిల్లా ఉపాధ్యక్షులు పొందూరు కూర్మారావు, జిల్లా కార్యదర్శి పూజారి గోవిందరావు, జిల్లా ఆడిట్ కన్వీనర్ బి.ఉమామహేశ్వరరావు, సీనియర్ నాయకులు దొంతం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెసి

పార్వతీశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిధర్ జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో జెసి పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఎన్.ఎం.ఎం.ఎస్ స్టడీ మెటీరియల్ జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలకు ఒక్కోటి చొప్పున 500 కాపీలను ఉచితంగా జనవిజ్ఞాన వేదిక అందజేస్తుందని తెలిపారు.

కింతలి పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న డిఐఒ రామదాసు

పొందూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర సేవలను తప్పనిసరిగా అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఆర్.రామదాసు అన్నారు. మండలంలోని కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిల్లో వైద్యాధికారులు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఆస్పత్రికి వచ్చే రోగులకు తప్పనిసరిగా సేవలు అందజేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. డిఎంఅండ్‌హెచ్‌ఒ ఆదేశాల మేరకు అన్ని పిహెచ్‌సిలను పరిశీలించి వైద్యసేవలను అందించడంపై తగు సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పిహెచ్‌సిల్లో వైద్యసేవలను అందించేందుకు పీజీ డాక్టర్లును నియమించడం జరిగిందన్నారు. పీజీ డాక్టర్లు బాధ్యతలను తీసుకుని ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవలను అందించనున్నారని తెలిపారు. అలాగే ఇమ్యునైజేషన్, ఎఎంసిల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈయనతో పాటు వ్యాక్సినేషన్ కోల్డ్‌చైన్ మేనేజర్ డి.స్వరూప్, పిహెచ్ఎన్ సూర్యకుమారి, సూపర్‌వైజర్లు మణిప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనంతో ట్రాఫిక్ ఇబ్బందులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం, ఆమదాలవలస ప్రధాన రహదారిపై బుధవారం భారీ వాహనం నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విశాఖపట్నం పోర్టు నుంచి ఒడిశా రాష్ట్రంలోని అంగూల్ ప్రాంతానికి వెళ్తున్న ఈ భారీ వాహనంపై ఎత్తయిన యంత్ర పరికరాలు ఉండటంతో రహదారి పైబాగాన విద్యుత్ వైర్లు, చెట్లు, వంతెనలు వంటి ఇబ్బందులు ఎదురుకావడంతో భారీ వాహనాన్ని సిఎస్‌పి రహదారిపై నిలిపివేశారు. రాయపాడు జంక్షన్ సమీపంలో వాహనం నిలిచిపోవడంతో శ్రీకాకుళం జిల్లా కేంద్రం నుంచి ఆమదాలవలస వైపు, ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వైపు ప్రయాణించే వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులకు గురయ్యాయి. భారీ వాహనం నిలిచిపోవడంతో వాహన రద్దీ పెరిగి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వాహనం నిలిచిన ప్రదేశానికి సమీపంలో ఉన్న చర్చి కల్వర్ట్ వద్ద సాధారణ రోజుల్లోనే ట్రాఫిక్ సమస్యలు ఉండగా ఈ సంఘటనతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. గంటల పాటు వేచి చూడాల్సి వచ్చిందని వాహనదారులు, ప్రయాణికులు


రహదారిపై నిలిచిపోయిన భారీ వాహనం

ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వాహనాల ప్రయాణానికి వివిధ శాఖల అనుమతులు అవసరమవడంతో, రహదారి క్లియరెన్స్ పూర్తయ్యే వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పవని వాహనదారులు తెలిపారు. పెద్ద పరిమాణంలో యంత్ర పరికరాలను తరలించే వాహనాల రాకపోకల విషయంలో అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి తగు చర్యలు తీసుకుని వాహన రాకపోకలు, ప్రయాణికుల ప్రయాణానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.

తొలగించిన ఉద్యోగిని విధుల్లోకి తీసుకోవాలి

పోస్టల్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

గ్రామీణ తపాలా ఉద్యోగుల జాతీయ నాయకులు మహాదేవయ్యను ఉద్యోగం నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ తపాలా ఉద్యోగుల కేంద్ర సంఘాలు ఇచ్చిన దశల వారీ పోరాట కార్యక్రమాల్లో భాగంగా మొదటి విడతగా బుధవారం జిల్లా పోస్టల్ కార్యాయం ముందు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. దేశ వ్యాప్తంగా అన్ని డివిజనల్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాన్ని పిలుపునివ్వడంతో ఈ ధర్నా చేశారు. శ్రీకాకుళం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఆఫీసు వద్ద జిల్లా నలుమూలల నుంచి దాదాపు 300 మంది ఉద్యోగులు హాజరై తక్షణమే తమ నాయకున్ని వీధుల్లో తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ధర్నా సందర్భంగా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నందికేశ్వరరావు మాట్లాడుతూ మహాదేవయ్యను తిరిగి విధుల్లోకి తీసుకునే వరకూ పోరాటాలు కొనసాగుతాయన్నారు. ఈ సందర్భంగా నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు గణపతి మాట్లాడుతూ ఈ తపాలా శాఖను నిర్వీర్యం చేయడానికి


ధర్నా నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

అడ్డంగా ఉన్న సంఘాలను, సంఘ నాయకులను అణిచి వేయటాన్ని తీవ్రంగా ఖండించారు. పోస్టల్ ఉద్యోగులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ సంఘీభావాన్ని తెలియజేయడానికి సిఐటియు జిల్లా కార్యదర్శి తేజేశ్వరరావు, బిఎస్ఎన్ఎల్ జిల్లా అధ్యక్షులు గోవర్ధన్, మెడికల్ ఆర్ఐపిఎస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాము, రిమ్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ నాయకులు రాము, ఎన్ఎసిఎల్ నాయకులు శ్రీనివాస్, బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నాయకులు ఎం.శ్రీనివాస్, రైల్వే పెన్షనర్ సంఘం నాయకులు సూరయ్య, పోస్టల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు చంద్రశేఖర్, వెంకటరావు, జ్యోతీశ్వరరావు, పోస్టల్ ఉద్యమ జిల్లా నాయకులు యు.వి.రమణ, బాబూరావు, అప్పారావు హాజరయ్యారు.

సేంద్రీయ ఉత్పత్తులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి- కంచిలి

రసాయనిక ఎరువులు ఉపయోగించకుండా సేంద్రీయ పద్ధతుల్లో పండించే స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ, రైతులను ప్రోత్సహించాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. కంచిలిలో కంచమ్మ తల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యాన చేపట్టిన రైతుబందు కార్యక్రమంలో బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతుల్లో గిరిజనులు పండించిన పంటలను విక్రయించేందుకు ఏర్పాటు చేసిన ఇటువంటి స్టాల్స్ వల్ల ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ప్రతిఒక్కరూ సేంద్రీయ పద్ధతుల్లో పండించిన ఉత్పత్తులను వినియోగించుకోవాలని సూచించారు. అత్యధిక మోతాదులో ఎరువులు ఉపయోగించకూడదన్నారు. సాగులో వ్యవసాయ


ప్రారంభిస్తున్న విప్ అశోక్

ఉద్యానవనశాఖ అధికారులు సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పిఎస్ చైర్మన్ కృష్ణారావు, డైరెక్టర్లు రాజేశ్వరి, అనూష, వల్లభరావు, శ్రీకాంత్, నైరా ప్రొఫెసర్ సృజన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోకుని సిబ్బంది సత్కరించారు.

వైసిపి కార్యకర్త వేణుగోపాల్ రెడ్డి అరెస్టు

పలాస: కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ పట్ల అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలపై వైసిపి నాయకులు పై వేణుగోపాల్‌రెడ్డిని అరెస్టు చేశామని, పలాస మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిందని కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ బుధవారం తెలిపారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో కల్తీ మద్యం అమ్మకాలకు, అధిక ధరలకు మద్యం అమ్మకాలకు నిరసనగా మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యాన నిరసన చేపట్టారని అన్నారు. ఈ నిరసన ర్యాలీలో బందోబస్తు విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్‌పై వేణుగోపాల్‌రెడ్డి అనుచితంగా ప్రవర్తించాడని అన్నారు. దీనిని నివారించే ప్రయత్నం చేసిన మరో కానిస్టేబుల్ తనపై కూడా దురుసుగా ప్రవర్తించాడని అన్నారు. దీంతో ఆయనను మంగళవారం అరెస్టు చేశామన్నారు.

గడ్డిమందు తాగి బాలిక మృతి

రణస్థలం : జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంచాం గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న ఎం.భాగ్యశ్రీ (14) గడ్డి మందు తాగి మృతి చెందింది. వివరాల్లోకి వెళితే గతేడాది భాగ్యశ్రీ తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి భాగ్యశ్రీ మనస్థాపానికి గురై ఆదివారం గడ్డిమందు తాగింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి వైద్య సేవలు అందించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. భాగ్యశ్రీ తండ్రి ఎం.రమణ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.


ప్రమాదంలో మృతిచెందిన సంతోష్‌కుమార్, (సంతోష్‌కుమార్ ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మరొకరికి గాయాలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని నీలంపేట గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా గరివిడి మండలం పేరిపేట గ్రామానికి చెందిన దాకమూరి సంతోష్ కుమార్ (19) మృతి చెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు అందించిన వివరాల మేరకు విశాఖపట్నం మండలం గాజువాకకు చెందిన నమ్మి కనకరాజు, విజయనగరం జిల్లా గరివిడి మండలం పేరిపేట గ్రామానికి చెందిన దాకమూరి సంతోష్ కుమార్ కలిసి పార్వతీపురం పట్టణంలో జరుగు శుభకార్యానికి ద్విచక్ర వాహనంతో శ్రీకాకుళం మీదుగా వస్తుండగా నీలంపేట గ్రామ సమీపం వద్ద వున్న పెద్దపెద్ద గోతులను గమనించకపోవడంతో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో సంతోష్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. కనకరాజు గాయాలతో బయటపడ్డాడు. అయితే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగి సంతోష్ కుమార్ మృతి చెందాడని కనకరాజు తెలిపాడు. సంతోష్ కుమార్ మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అయితే సంతోష్ కుమార్ ప్రమాదవశాత్తు మరణించాడా లేక ట్రాక్టర్ ఢీ కొట్టడంతో మృతి చెందాడా అన్నది పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవళ్లిక తెలిపారు.

ఆశల దీపం ఆరిపోయింది

రజక సామాజిక వర్గానికి చెందిన సంతోష్ కుమార్ తల్లిదండ్రులు పాపారావు, అప్పల నరసమ్మలు గ్రామంలో రజక వృత్తిపై జీవనం సాగిస్తున్నారు. ఉన్న ఒక్కగానొక్క కొడుకును బాగా చదివించి మంచి భవిష్యత్ ఇవ్వాలని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే కుమారుడి మృతి వార్త విని తల్లిదండ్రులు తమ ఇంటి ఆశల దీపం ఆరిపోయిందని, అందివచ్చిన కొడుకు ఇక లేడని బోరున విలపిస్తున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి నిరుపేద కుటుంబమైన సంతోష్ కుమార్ కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. సంతోష్ కుమార్ మృతి వార్త తెలియడంతో గ్రామంలో పేరిపేటలో విషాదఛాయలు అలముకున్నాయి.

పుస్తెలతాడు చోరీ

సంతబొమ్మాళి: మండలంలోని నగిరిపెంట గ్రామ బస్‌షెల్టర్ వద్ద బూధవారం వృద్ధురాలిపై దొంగలు దాడి చేసి ఆమె గొలుసును అపహరించారు. బోరుభద్ర గ్రామానికి చెందిన మార్పు అప్పన్నమ్మ తన తల్లి అనారోగ్యంగా ఉందని తెలిసి నగిరిపెంట గ్రామానికి వచ్చి తిరిగి బోరుభద్రకు వెళ్లడానికి బస్‌షెల్టర్ వద్ద ఆటో కోసం వేచి చూస్తుంది. ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెలతాడు తెంపుకున్నారు. అయితే పుస్తెలు ఆమె చేతిలోనే



ఉండిపోగా రెండు తులాల తాడు దోచుకుని బైక్‌పై పరారయ్యారు. ఈ ఘటనపై సంతబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సింహాచలం తెలిపారు.

పోక్సో కేసు నమోదు

రణస్థలం : బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొనిపేట గ్రామానికి చెందిన మైలపల్లి రాజ్ కుమార్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను ఈనెల 4న కిడ్నాప్ చేశాడు. మైనర్ బాలిక తల్లి ఎస్.లక్ష్మీ స్థానిక జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు బుధవారం బాలికను కిడ్నాప్ చేసిన రాజ్ కుమార్‌ను దొనిపేట పరిసర ప్రాంతంలో పట్టుకుని పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని తోటాడ గ్రామంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం తోటాడ గ్రామంలో రహస్యంగా పేకాట జరుగుతోందని తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న బెండి గిరిబాబు, కాంచరాన వరహానరసింహం, పైడి రంగారావు, తాంద్ర రమణ, కూటికుప్పల రామారావు, గురుగుబెల్లి నరసింహమూర్తి, సనపల రమణ, పైడి వేణు, క్రి జనార్ధన రావులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ5,060 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ సనపల బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


స్వాధీనం చేసుకున్న బైకులను పరిశీలిస్తున్న పోలీసులు

బైక్ దొంగలు దొరికారు

- ముగ్గురు నిందితుల అరెస్టు
- అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన బైక్ దొంగతనం కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి ఏడు రాయల్ ఎన్‌ఫీల్డు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు వెల్లడించారు. ఈనెల 14వ తేదీ సాయంత్రం రూరల్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వైపు రెండు రాయల్ ఎన్‌ఫీల్డు బైక్‌లపై వస్తున్న ముగ్గురు వ్యక్తులను దూసి జంక్షన్ వద్ద అరెస్ట్ చేశారు. దొంగతనం దర్యాప్తులో వీరి వద్ద నుంచి మొత్తం ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు విచారణలో భాగంగా మొదటి నిందితుడు దండు రిషివర్ధన్‌పై విశాఖ పట్నం కమిషనరేట్ పరిధిలోని పిఎం పాలెం పోలీస్‌స్టేషన్‌లో ఒక హత్య కేసు, పార్వతీపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఒక చీటింగ్ కేసు ఉంది. రెండో నిందితుడు రాయిపల్లి వినోద్‌పై సాలూరు పోలీస్ స్టేషన్‌లో ఐదు సారాకేసులు, సాలూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో మరో సారా కేసు, గంట్యాడ పోలీస్ స్టేషన్‌లో ఒక డకాయిటీ కేసు, పార్వతీపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఒక చీటింగ్ కేసు సహా మొత్తం ఏడు కేసులు ఉన్నట్లు నిర్ధారణైంది. ఇతనిపై సస్పెక్ట్ షీట్ కూడా ఉంది. అదనంగా, పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఈయనపై పీడీ యాక్ట్ కూడా అమలు చేశారు. మూడో నిందితుడు చిట్టి సంతోష్ కొత్తూరు పట్టణంలో సెకండ్ హ్యాండ్ బైక్ షోరూమ్ నిర్వహిస్తున్నాడు. ముగ్గురు కలిసి బైక్‌లను దొంగతనం చేసి, నంబర్ ప్లేట్లు మార్చి, మోటార్ సైకిళ్లను అమ్ముతూ ఉన్నట్లు విచారణలో తేలింది. మద్యవర్తుల సమాచారం మేరకు శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ కె.రాము, సిబ్బంది కలిసి ఈ మోటార్ సైకిళ్లను రికవరీ చేశారు. కేసును చాకచక్యంగా ఛేదించినందుకు ఎస్ఐ రాము, కానిస్టేబుళ్లు బాబురావు, నారాయణ రావు, సురేష్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో డిఎస్‌పి సిహెచ్ వివేకనంద పాల్గొన్నారు.



అభినందిస్తున్న కలెక్టర్, జెసి

ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంకు అభినందనలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

స్వచ్ఛాంధ్ర-25 రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్న నేలబొంతు ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.విజయ భారతిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు బుధవారం అభినందించారు. విజయవాడలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రధానోత్సవంలో ఈ నెల 6న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా హెచ్‌ఎం అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు అన్నదొరై తదితరులు పాల్గొన్నారు. హెచ్‌ఎంకు ఎంఇఒలు ఎస్.దేవేందరరావు, ఎం.పద్మనాభరావులు అభినందించారు.

జిఎస్‌టి సంస్కరణలతో పేదలకు మేలు

ప్రజాశక్తి- రణస్థలం

జిఎస్‌టి సంస్కరణలతో పేదలకు మేలు జరుగుతుందని ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు అన్నారు. మండలంలోని కోష్ట జంక్షన్‌లో షాపును సందర్శించి జిఎస్‌టి సంస్కరణలను వివరిస్తూ పోస్టర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలు వినియోగిస్తున్న నిత్యావసర సరుకులపై జిఎస్‌టి శ్లాబ్‌లు తగ్గించటం వలన ప్రతి కుటుంబంపై నెలకు రూ.15 వేలు వరకు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు లంక శ్యామలరావు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పిన్నింటి భానోజీనాయుడు, పిసిని జగన్నాథం నాయుడు, కనకారావు, పిసిని ఆసిరి నాయుడు, దన్నాన వంశీ తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లి: జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఎన్‌టిఆర్ మున్సిపల్ స్కూల్ మైదానంలో నృత్య దర్శకులు నీరజ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నృత్యప్రదర్శన అలరించాయి. ఈ నృత్య ప్రదర్శనలో కె. శ్రీహర్షిత, బి.వర్షత, కె.మానస, ఎం.నేహా ప్రియాంక, కె.ప్రవల్లిక తదితరులు నృత్యప్రదర్శనలో అలరించారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ అధికారి నారాయణ రావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- బూర్జ

మహిళలు, విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కేస్ వర్కర్ కుప్పిలి ప్రసన్న రాణి అన్నారు. బుధవారం ఆడపిల్లలని రక్షిద్దాం, ఆడపిల్లలని చదవనిద్దాం అనే నినాదంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వన్ స్టాప్ సెంటర్ల ద్వారా ప్రాజెక్ట్ సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో మహిళలు, ఆడపిల్లలను చదివించడంతో పాటు, వారి స్వీయ రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సురక్షిత స్పర్శ, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, గృహహింస, మానవ అక్రమ రవాణా, అత్యాచారాలు వంటి పలు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళలకు ఎటువంటి కష్టం కలిగినా 1098, 181, 112 హెల్ప్‌లైన్ నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. బాలికలు ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుష్మ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ శశిధర్, భోధన సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పుల్లాజీపేట (రెడ్డిపేట)లో కొన్నేళ్లుగా ఎయిర్‌బ్రేక్ స్విచ్‌లేకపోవడంతో తలెత్తుతున్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు విద్యుత్ శాఖ ఎఇ సుధీర్‌ను కోరారు. బుధవారం విద్యుత్‌శాఖ ఎఇ సుదీర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో ఐసి లేకి కారణంగా ఇప్పటికే ముగ్గురు వ్యక్తులు విద్యుత్ షాక్‌కు గురై మరణాల అంచుల వరకూ వెళ్లి బయటపడ్డారని తెలిపారు. రెండు రోజుల క్రితం గ్రామంలో విద్యుత్‌షాక్‌కు గురై ఉమామహేశ్వరరావు అనే వ్యక్తి మృతిచెందడం కూడా దీనికి కారణమై ఉండవచ్చునని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై విద్యుత్ లైన్‌మేన్‌లకు పలుమార్లు తెలియజేసినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

చెరువు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట కేంద్రంలోని గోరువాని చెరువు పనులను సర్పంచ్ బి.శంకర్, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు ఆధ్వర్యాన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ చెరువు అభివృద్ధి కృషి చేస్తామన్నారు. పంచాయతీ నిధులు రూ.4 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటితో చెరువులో పూడికలుతీతకు శుభ్రం చేసేందుకు ఉపయోగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇఒ పి.ద్రాక్షాయిని, కూటమి నాయకులు చింతు పాపారావు, సతీష్, బుజ్జి పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారం తగదు

ప్రజాశక్తి- కొత్తూరు

వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు అనుచరులు నాలుగేళ్లుగా వ్యక్తిగతంగా జరిగిన వాటిని మీడియాలో దుష్ప్రచారం తగదని తహశీల్దార్ కె.బాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల మండలంలోని బలదకు చెందిన మహిళ పొజిషన్ ధ్రువపత్రం దరఖాస్తు చేసుకుందన్నారు. అది బలద సంతలో ఆ స్థలం ఉండడంతో ఆమెకు భూ హక్కు పత్రం ఇవ్వడానికి నిరాకరించామన్నారు. దీంతో ఆమె తనతో దురుసుగా ప్రవర్తించడం, కులం పేరుతో దూషించారని అన్నారు. ఇదే విషయమై పోలీసులు ఫిర్యాదు చేశామని, కేసు నమోదు చేశారని అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సమావేశానికి హాజరైన వైస్ ఎంపిపి నిబంధనలు ప్రకారం ఉండాచ్చా అని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బి.రాంబాబును అడిగానని తెలిపారు. ఎంపిపి సవర సావిత్రి అనుమతితో ఉండవచ్చునని చెప్పారని అన్నారు. దీంతో వైస్ ఎంపిపితో వాగ్వాదం చోటు చేసుకుందన్నారు. అనంతరం సభ నుంచి బయటకు వచ్చేశానని తెలిపారు. రెవెన్యూ పరంగా తప్పులు చేసి ఉంటే సదరు వ్యక్తులు నిలదీయాలి తప్ప ఇటువంటి సోషల్ మీడియాలో ప్రచారాలు మానుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో బింజయ్యకు గోల్డ్ మెడల్

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఏలూరులోని విశ్వనాథ్ భర్తీయా ఈతకులంలో ఇటీవల ముగిసిన ఏడో రాష్ట్ర పారాస్విమ్మింగ్ పోటీల్లో సీనియర్ మెన్ విభాగం ఎస్-9 కేటగిరీలో రింపి బింజయ్య మెరుగైన ప్రతిభ కనబరిచి పతకాలు గెలుచుకున్నారు. వంద మీటర్ల బెస్ట్ స్టోక్ గోల్డ్ మెడల్, 50 మీటర్ల బెస్ట్ స్టోక్‌లో సిల్వర్ మెడల్, అలాగే 50 మీటర్ల వాటర్ ప్లే ఈవెంట్‌లో కూడా సిల్వర్ మెడల్ సాధించారు. రింపి బింజయ్య విజయాన్ని పురస్కరించుకుని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రామకృష్ణయ్య సన్మానించి అభినందనలు తెలిపారు. బింజయ్య మండలంలోని ఆంపురానికి చెందినవారు. రాష్ట్రస్థాయిలో క్రీడా పోటీల్లో తన ప్రతిభతో గ్రామానికి గుర్తింపు తెచ్చిన ఆయన భవిష్యత్‌లో దేశ స్థాయిలో మెరుగైన విజయాలు సాధించాలని సర్పంచ్ జిజమ్మయ్య, పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

దీర్ఘాశిలో అన్నదానం



అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పోలాకి: మండలంలోని దీర్ఘాశి దుర్గా నగర్ కాలనీలో ప్రసన్నాంజనేయ ఆలయ ప్రతిష్ట సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యాన బుధవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని యాత్రికులకు వడ్డించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, ఎం.వెంకట అప్పలనాయుడు, భైరి భాస్కరరావు, పల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కలాం సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- కవిటి

భారతదేశానికి అబ్దుల్ కలాం చేసిన సేవలు మరువలేనివని పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్ అన్నారు. మండలంలోని ఎర్ర గోవిందపుట్టుగ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో మాజీ రాష్ట్రపతి కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అదే విధంగా కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, కళ్యాణి ఆంగ్ల పాఠశాల, ఎస్‌విజె విద్యా సంస్థలు, కవిటి కొత్తూరులోని బివికె పాఠశాలల్లో కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎర్ర నరేష్, బల్ల వాసుదేవ్, కె.మోహన్, సిహెచ్.నాగేష్, సిహెచ్.తిరుమల, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసన్నపేట: స్థానిక డిగ్రీ కళాశాలలో అబ్దుల్ కలాం చిత్రపటానికి ప్రిన్సిపాల్ పి.లత పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శాంతిహేమ, భౌతికశాస్త్ర అధ్యక్షులు పి.ఢిల్లేశ్వరావు, జి.రవికుమార్, అన్నాజీరావు, త్రినాథరావు, పవిత్ర, నాగరాజు పాల్గొన్నారు.

పోలాకి : కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు జి.శాంతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింతాడ లక్ష్మణరావు, మోహిని, వెంకటరమణ, నారాయణరావు, శ్రీహరిరావు, శాంతి, హేమలత, జగన్, బాడాన రాజు, వేణుగోపాలరావు, రాజేశ్వరరావు, రఫీ, కళావతి, డోల వసంతరావు, తమరాపు రాంబాబు, సూర్యకుమారి, ధర్మేంద్ర పాల్గొన్నారు.

నందిగాం : గ్రంథాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఉదయ్‌కిరణ్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు రాములమ్మ, గ్రంథ పాఠకులు బి.సింహాచలం, ధనుష్, రవికుమార్ పాల్గొన్నారు.



ఎచ్చెర్ల : నివాళ్లర్పిస్తున్న ప్రొఫెసర్ బాలాజీ తదితరులు

మెళియాపుట్టి : మండలంలోని కరజాడ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు టి.వి.రమణమూర్తి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఇందులో భాగంగా జిల్లా వినియోగ దారుల క్లబ్బుల మాస్టర్ ట్రైనర్ ఎల్.వెంకటాచలం సమకూర్చిన పది మొక్కలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల ఆవరణలో నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.శ్రీరాముము, జి.గోపాలకృష్ణ, సి.ఆదినారాయణ, పి.ప్రమీల, పుష్పకుమారి పాల్గొన్నారు.

పలాస : కోర్టు ఆవరణలో అబ్దుల్ కలాం చిత్రపటానికి సివిల్ జడ్జి కోర్టు యు.మాధరి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. బార్ అసోషియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్, న్యాయవాదులు బి.కామేశ్వరరావు పట్నాయక్, కొమర దేవరాజు, పిండి వెంకటరావు, జి.ప్రభాకర్, బి.కాళిదాస్ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డా.ఎ.పి.జె అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి బాలాజీ మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ మహాజ్ఞాని, నిగర్వి కలాం అని కొనియాడారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు నేడు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశం ఎంతో అభివృద్ధిని సాధిస్తుందని, అందులో విద్యార్థులు, యువత పాత్ర కీలకం అన్నారు. కార్యక్రమంలో ఎఒ ముని రామకృష్ణ, ఎన్.ఎస్.ఎస్ కో-ఆర్డినేటర్ డా.పెద్దింటి ముకుంధరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డా.బి. శ్రీధర్, టి.అసిరినాయుడు, పి.గాయత్రి, ఆర్.పద్మావతి, ఇన్‌ఛార్జి వి.సాగర్, అకాడమిక్ కో-ఆర్డినేటర్ కోటారావు, అధ్యాపకులు వి.వినోద్‌కుమార్, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరసవల్లి: నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో అబ్దుల్ కలాం 94వ జయంతి నిర్వహించారు. కమిషనర్ మున్సిపల్ కమిషనర్ పివిడిడి ప్రసాద్, విగ్రహదాతలు బరాటం శ్రీరామ్మూర్తి, బరాటం లక్ష్మణరావు, గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు సురంగి మోహన్‌రావు, జామి భీమశంకర్, వాకర్స్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, కొంక్యాన వేణుగోపాల్, పొన్నాడ రవికుమార్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమం మెట్ట అనంతంభట్లు, మహిబుల్లాఖాన్, చౌదరి రాధాకృష్ణ, జి.నాగేశ్వరరావు, కొమ్ము రమణమూర్తి, టెక్కం రాంగోపాలరావు, నిష్టల నరసింహమూర్తి, శాస్త్రి, మాజీ సైనికుల సంక్షేమం సంఘం ప్రతినిధులు పద్మావతి, కె.జగ్గమ్మ పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తికి సత్కారం

పోలీస్ ఉద్యోగంలో కానిస్టేబుల్‌గా చేరినప్పటి నుంచి 30 ఏళ్ల పాటు ప్రతి నెలా తన జీతంలో 20శాతం పేదలకు పలు రూపాల్లో సహాయమందిస్తూ నేటికీ ఆస్ఫూర్తిని కొనసాగిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లా హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తిని కమిషనర్ ప్రసాదరావు, గాంధీ మందిర ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కష్ణమూర్తి త్యాగనిరతిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న పేద మహిళలకు బట్టలు, చీరలు కమిషనర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

అలాగే అబ్దుల్ కలాం జయంతిని బలగ హడ్కోకాలనీలో గల శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో బి.ఉమామహేశ్వరరావు, కె.అనిత, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ విద్యార్థుల దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్.ఎస్.ఎం. స్వామి మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త 'మిసైల్ మాన్'గా ప్రసిద్ధి చెందిన డా. ఎపిజె అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డా. సాయి కిరణ్‌కుమార్, శ్రీనివాసరావు అష్టలక్ష్మి, రాజశేఖర్, బాలరాజు, ప్రసాదరావు, జగన్నాధరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు: మాజీ రాష్ట్రపతి కలాంను ప్రతి విద్యార్థి ఆదర్శవంతంగా తీసుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. కలాం జయంతి సందర్భంగా లావేరు శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని పైడిభీమవరంలో మూడు కుటుంబాలు గుడివాడ నందీశ్వరరావు, సీరపు సీతయ్య, ఇనుకోటి రాంబాబు బుధవారం టిడిపి నుంచి వైసిపిలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోనికి ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు, రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ పిన్నింటి సత్యం నాయుడు, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రెటరీ పాశపు ముకుంధరావు, టేకు లక్ష్మణరావు, లంకలపల్లి ప్రసాదరావు, ఎంపిటిసిలు ఆకల శ్రీనివాసరావు, మునకాల దుర్గారావు, భావిశెట్టి రమేష్, భావిశెట్టి సీతారామయ్య, భావిశెట్టి నారాయణప్పారావు, కాజా సంతోష్, కాజా రమణ, పైడి చంద్రరావు, విజయశాంతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ప్రజాశక్తి- బూర్జ

మహిళలు అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతున్నారని, ముఖ్యంగా వ్యవసాయ రంగంలో కూడా ముందుండాలని ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు అన్నారు. బుధవారం పెద్దపేటలో ఉన్ సంస్థ కార్యాలయంలో అంతర్జాతీయ రైతు మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. అలాగే వ్యవసాయం, ఉద్యానవనశాఖలో ఆసక్తి కనబర్చి అందులో కూడా పూర్తిస్థాయిలో విజయం సాధించాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాలు మహిళలకు అన్ని విధాలుగా అభివృద్ధి చెందేందుకు పెద్దపీట వేస్తున్నాయన్నారు. ఆ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో మహిళలు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష వితరణ

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని బుధవారం విశాఖపట్నంకు చెందిన శివాని సందర్శించారు. దేవాలయ అన్నదాన పథకానికి రూ.లక్ష అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ పర్యవేక్షక అధికారి వెంకట రమణకు అందజేశారు.

మాజీ ఎమ్మెల్సీ పరామర్శ

ఆమదాలవలస: రాష్ట్ర పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు సనపల అన్నాజీరావు మాతృమూర్తి రత్నాలమ్మ మృతికి పలువురు ప్రముఖులు నివాళ్లర్పించారు. బుధవారం మండలంలోని కొర్లకోటలోని ఆయన స్వగృహంలో రత్నాలమ్మ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం అన్నాజీరావును పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కాంగ్రెస్ నాయకులు కిల్లి రామ్మోహనరావు, రెల్ల సురేష్, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

చదువులో పోటీతత్వం అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రవిబాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల కళాశాలలో బివైసి స్కాలర్ షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు బుధవారం స్కాలర్ షిప్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని లంకపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని సన్యాన హేమిని పదవ తరగతిలో 569 మార్కులు సంపాదించి మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన సందర్భంగా హేమని తల్లి రాముకి యూత్ క్లబ్ బెజ్జిపురం ద్వారా రూ.10 వేలు స్కాలర్ షిప్‌ను అందించారు. హెచ్‌ఎం రాంబాబు, ఉపాధ్యాయులు కెల్ల రమణ, పందిరి రమణ, రమేష్, విశ్వప్రసాద్, లక్ష్మణరావు, వెంకటప్పడు, పూర్ణావతి, రాంబాబు, శైలజ, ప్రసన్న కుమార్, జగన్నాథం, శైలజ తదితరులు అభినందించారు.

హోన్నాలి గ్రామస్తుల హర్షం

ప్రజాశక్తి- మందస

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు మందస మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయిని తగ్గించారు. మండలంలోని పది ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయిని కోల్పోయి ప్రాథమికోన్నత పాఠశాలలు లేని మండలంగా తయారైంది. మిగిలిన గ్రామాలకు భిన్నంగా హోన్నాలి గ్రామస్తులు చైతన్యవంతమైన ప్రజా ఉద్యమాలు చేసి పాఠశాలను కాపాడుకోవడానికి తీవ్ర ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నానికి తోడుగా అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహలే లక్ష్యంగా పనిచేస్తున్న ఉపాధ్యాయ సంఘమైన యుటిఎఫ్ మద్దతుగా నిలిచింది. దీంతో అప్పటి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ తిరుమల చైతన్యను ప్రాథమిక పరిశీలన నిమిత్తం హోన్నాలి, కొరడాబడి గ్రామాలు క్షేత్రస్థాయిలో సందర్శించారు. అనంతరం ప్రభుత్వానికి నివేదిక పంపించారు. దీంతో ప్రాథమికోన్నత పాఠశాలలుగా ప్రభుత్వం కొనసాగించింది. దీంతో ఆయా గ్రామస్తులు హర్షాతి రేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కల్పనలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం

ప్రజాశక్తి- పొందూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యులు కావాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆడపిల్ల సేవా సొసైటీ ఆధ్వర్యంలో యువతకు వివిధ ఉద్యోగాల కోసం ఏర్పాటుచేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. సొంతనిధులతో స్వచ్ఛందసంస్థ ద్వారా ఇటువంటి కార్యక్రమం నిర్వహణపై సంస్థ నిర్వాహకులు, పొందూరు సచివాలయ మహిళాపోలీస్ మడ్డి లావణ్యను రవికుమార్ అభినందించారు. పరిశ్రమలు వస్తేనే ఆ ప్రాంతం, యువత అభివృద్ధి చెందుతారనే విషయం గమనించి పరిశ్రమల స్థాపనకు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. సిఎం చంద్రబాబు సహకారంతో నియోజకవర్గంలో సోలార్ మేకింగ్ పరిశ్రమ స్థాపనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వాసుదేవరావు, సర్పంచ్ ఆర్.లక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షులు వండాన మరళి, మాజీ ఎఎంసి చైర్మన్ ఎ.రాము, నాయకులు సీపాన శ్రీరంగనాయకులు, బలగ శంకర భాస్కర్, అనకాపల్లి చినరంగ, బాడాన గిరి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ చేయాలి



మాట్లాడుతున్న వైస్ ఎంపిపి తులసీవరప్రసాదరావు

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని ఎరువులు దుకాణాలను తనిఖీ చేయాలని మెట్టూరు బిట్-3 సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు ఎఒ ఎస్.స్వర్ణలతను ప్రశ్నించారు. ఆమె స్పందించి తనిఖీలు చేస్తామని సమాధానం చెప్పారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి సవర సావిత్రి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. బలదలో నూతనంగా నిర్మిస్తున్న అంగన్వాడీ భవనానికి బిల్లులు మంజూరు చేశారా? అని పిఎసిఎస్ అధ్యక్షులు మాతల గాంధీ ఐసిడిఎస్ సెక్టార్ సూపర్‌వైజర్‌ను అడిగారు. బిల్లులు మంజూరు చేశామన్నామని తెలిపారు. కూరిగాం పిహెచ్‌సిలో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బి.రాంబాబు మాట్లాడుతూ నివగాం ఎస్‌సి వీధి ప్రధాన రహదారి ఇరువైపులా కాలువల నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు రూ.29 లక్షలు మంజూరు చేశామన్నారు. అలాగే మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల రహదారిలో గ్రామీణ బ్యాంకు వద్ద ఇరువైపులా కాలువ నిర్మాణానికి రూ.26 లక్షలు మంజూరుగా, అదనంగా మండల పరిషత్ నిధులు మంజూరు చేసేందుకు తీర్మానం ప్రవేశపెట్టామన్నారు. తహశీల్దార్ కె.బాలకృష్ణ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం స్టేజ్‌పై ఎవరూ ఉండాలని ఎంపిపిని అడిగారు. ఆమె సమాధానం చెప్పకపోవడంతో ఇంతలో వైస్ ఎంపిపి మైక్ తీసుకుని మీరు మాకు చెప్పడం ఏమిటి తిరగ ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వెంటనే సభ్యులు సభ ముందుకు చేరుకున్నారు. దీంతో తహశీల్దార్ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలంటూ సభ ఏకగ్రీవంగా తీర్మానం చేసి కలెక్టర్‌కు నివేదిక పంపించాలని ఎంపిడిఒను సభ్యులు కోరారు. సభకు గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని తీర్మానించారు.

మహిళలతో గ్లోబల్ వాష్ డే



అవగాహన కల్పిస్తున్న కూర్మారావు

మందస: గ్రామీణ ప్రాంతంలో మహిళలకు సెర్ఫ్ సిఇఒ ఆదేశాల మేరకు బుధవారం 15 గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా చేతులను శుభ్రపరచడంపై అవగాహన కల్పించినట్లు వెలుగు ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మందసలో గ్రామీణ మహిళలకు ఎక్కువ అనారోగ్యానికి గురి కాకుండా ఉండడానికి పరిశుభ్రమైన పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, ప్రాముఖ్యమైన పాత్ర పోషిస్తాయని వివరించారు. భోజనానికి ముందు, తర్వాత, వంటచేసే ముందు, తరువాత, ముఖ్యంగా పిల్లలు ఆటలాడుకున్న తర్వాత, మలమూత్ర విసర్జన తరువాత, తప్పనిసరిగా చేతులను సబ్బుతో కడుగుకుంటే అంటు వ్యాధుల బారిన పడకుండా నివారించుకోవచ్చని తెలిపారు. మహిళా సంఘ సభ్యులు నెలవారీ సమావేశాల్లో పొదుపులు, అప్పులతో పాటు ఆరోగ్య కార్యక్రమాలు, చేతుల పరిశుభ్రతపైనా బాధ్యతతో చర్చించుకోవలసిన ఆవశ్యకత ఉందని వివరించారు. కార్యక్రమంలో వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలు, గ్రామ సంఘం ప్రతినిధులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో కమిషనర్ ఎన్.రమేష్ ఆధ్వర్యాన గ్లోబల్ వాష్ డే సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ చేతులు పరిశుభ్రత, పరిసరాలు పరిశుభ్రత గురించి మాట్లాడారు. కార్యక్రమంలో టిఎంసి భాస్కరరావు, సిఒ సంతోష్, శ్రీను పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

పోలాకి: కూటమి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి శూన్యమని జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య విమర్శించారు. మండలంలోని చీడివలసలో రచ్చబండ (కార్యకర్తలతో కృష్ణచైతన్య) కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రచారార్భాటం తప్ప ప్రజలకు చేసింది శూన్యం అన్నారు. వైసిపి పథకాలని కాపీ కొట్టి చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. చిత్తూరు నుంచి నరసన్నపేట వరకు కల్తీ మద్యం ఫ్యాక్టరీలు పెట్టి ప్రజలను కల్తీ మద్యానికి బానిసలు చేస్తున్నారని మండిపడ్డారు. వైసిపి కార్యకర్తలు ప్రజలకు నిజాలు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి ముద్దాడ దమయంతి భైరాగినాయుడు, వైసిపి మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, యువజన కార్యదర్శి చింతు రాఘవ, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు కల్లేపల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై చర్యలు తీసుకోవాలి

టెక్కలి : రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యంపై జరుగుతున్న వ్యవహారంపై స్థానిక ఎక్సైజ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మాజీ నీటి సంఘం అధ్యక్షులు సత్తారు వెంకటరమణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాల్లోని పలు మద్యం దుకాణాలపై సంబంధిత ఆదికారులు ఎప్పుడైనా దాడులు చేపట్టారా? అని ప్రశ్నించారు. స్థానికంగా ఉన్న పలు దుకాణాల్లో కల్తీ మద్యం తయారవుతుందన్న ప్రచారంపై అధికారులు చర్యలు తీసుకోవడంలో ఎందుకు వెనుకడుగువేస్తున్నారని ప్రశ్నించారు.

అవార్డు గ్రహీతకు సత్కారం

టెక్కలి : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జనార్ధనరావుని టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది బుధవారం సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరావు ఆధ్వర్యాన ఈ కార్యక్రమంలో భాగంగా నందిగాం జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్లిన తెలుగు అధ్యాపకులు రమణమూర్తినీ సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కిరణ్‌కుమారి, ఎస్.రవికుమార్, అజయ్‌కుమార్, పొన్నాడ నాగేశ్వరరావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాగోలు సబ్‌స్టేషన్ పరిధిలో తోటాడ పరిధిలో గల చెట్టుకొమ్మలు తొలగించడానికి, మరమతులు కొరకు ఈ నెల 17న (శనివారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాకుళం మండల పరిధిలోగల రాగోలు, కొత్త రోడ్డు, అక్కివరం, తోటాడ, గూడెం, రామనరసపేట, చంద్రయ్య పేట, దూసి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పైడి యోగేశ్వరరావు తెలిపారు. విద్యుత్ శాఖాధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు.

మెనూ తప్పనిసరి

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్నం భోజన పథకంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఇఒలు యు.శాంతారావు, దాలినాయుడు సూచించారు. మండలంలోని బొరిగివలస, మాకివలస జిల్లా పరిషత్ హైస్కూళ్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎ-2 పరీక్షల నిర్వాహణ, మధ్యాహ్న భోజనం పథకం నిశితంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి అండ

వజ్రపుకొత్తూరు: ఇటీవల సంభవించిన పడవ ప్రమాదంలో మృతి చెందిన దేవునల్తాడకు చెందిన బుడగట్ల చినబాబు కుటుంబానికి అదే గ్రామానికి చెందిన గుంటు విజయ్ సోదరులు బుధవారం ఆర్థిక సాయం అందించారు. గ్రామ పెద్దల సమక్షంలో మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతుని తల్లికి రూ.పది వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సౌదాల వెంకన్న, మాజీ సర్పంచ్ సీదిరి చిరంజీవి, సొసైటీ ప్రెసిడెంట్ అంబటి లక్ష్మణ్, గ్రామ పెద్దలు ఆప్పోజీ, పిల్ల రామారావు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

కవిటి: మండలం కేంద్రంలో మత్స్యకారుల కోసం ఏర్పాటు చేస్తున్న ఎఫ్‌పిఒ కార్యాలయానికి స్థలం కేటాయించాలని మత్స్యకారుల ఎఫ్‌పిఒ అధ్యక్షుడు గంతి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో కార్యాలయానికి స్థలం కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం గోవింద్, ఉపాధ్యక్షులు బడే మాధవరావు, సభ్యులు బడే చిరంజీవి, కాయ పురుషోత్తం, మాగుపిల్లి పురుషోత్తం పాల్గొన్నారు.

సురక్ష యాప్ ద్వారా మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి- సోంపేట

మద్యం వినియోగదారులు మీ సమీపంలో కొనుగోలు చేసిన మద్యం ప్రభుత్వం సరఫరా చేసినదా కాదా అని సులువుగా తెలుసుకోవడానికి ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సులభంగా వినియోగించగలిగే మొబైల్ అప్లికేషన్ ను అందుబాటులోకి తీసుకొచ్చామని ఎక్సైజ్ సిఐ రమణ అన్నారు. పట్టణంలో బుధవారం నాణ్యమైన మద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎపి ఎక్సైజ్ సురక్ష అనే మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్‌లో డౌన్లోడ్ చేసుకొని కన్స్యూమర్ అనే టాబ్‌పై ఉత్తినట్లయితే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడానికి వీలు అవుతుంది అప్పుడు మీరు కొనుగోలు చేసినటువంటి మద్యం సీసా మూతపై అతికించబడిన ఉన్న హీల్ పై ఉన్న క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేసినట్లయితే ఆ సీసా ఎక్కడ తయారైంది ఏ డిపో నుండి సరఫరా చేయబడింది, ఏ షాపులో మీరు కొనుగోలు చేశారో వంటి వివరాలు తెలుస్తాయని తెలిపారు.

టెక్కలి రూరల్ : మద్యం వినియోగదారులు ఎవరైనా కొనుగోలు చేసిన మద్యం ప్రభుత్వం సరఫరా చేసినదా? కాదా? అని సులువుగా తెలుసుకోవడానికి ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సులభంగా వినియోగించగలిగే మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఎక్సైజ్ సిఐ షేక్ మీరా సాహెబ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎపి ఎక్సైజ్ సురక్ష అనే మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకొని కన్స్యూమర్ అనే టాబ్ పైనొక్కినట్లయితే క్యూఆర్ కోడ్ స్కాస్ చేయడానికి వీలు అవుతుందన్నారు. లిక్కర్ నాణ్యతకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే 14405కి తెలియజేయలని తెలిపారు,

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మద్యం వినియోగదారులు కొనుగోలు చేసిన మద్యం ప్రభుత్వం సరఫరా చేసినదా? కాదా? సులువుగా తెలుసుకోవడానికి ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సులభంగా వినియోగించగలిగే మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు.

పొందూరు: ప్రభుత్వం రూపొందించిన ఎపి ఎక్సైజ్ సురక్షా యాప్ సహాయంతో నకిలీ మద్యం గుర్తింపు బాధ్యత మద్యం దుకాణాల్లో పనిచేసే నౌకరీ నామాలదేనని ఎక్సైజ్ సిఐ వై.రాజు అన్నారు. పొందూరు, జి.సిగడాం మండాలాల్లో మద్యం దుకాణాల్లో యాప్ ద్వారా నకిలీ మద్యం గుర్తింపు విధానాన్ని బుధవారం నౌకరీ నామాలకు వివరించారు. యాప్ ద్వారా స్కాన్ చేస్తే మద్యం నాణ్యత బయట పడుతుందన్నారు.

సోంపేట: మద్యం వినియోగదారులు మీ సమీపంలో కొనుగోలు చేసిన మద్యం ప్రభుత్వం సరఫరా చేసినదా కాదా అని సులువుగా తెలుసుకోవడానికి ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సులభంగా వినియోగించగలిగే మొబైల్ అప్లికేషన్ ను అందుబాటులోకి తీసుకొచ్చామని ఎక్సైజ్ సిఐ రమణ అన్నారు. పట్టణంలో బుధవారం నాణ్యమైన మద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎపి ఎక్సైజ్ సురక్ష అనే మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్‌లో డౌన్లోడ్ చేసుకొని కన్స్యూమర్ అనే టాబ్‌పై ఉత్తినట్లయితే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడానికి వీలు అవుతుంది అప్పుడు మీరు కొనుగోలు చేసినటువంటి మద్యం సీసా మూతపై అతికించబడిన ఉన్న హీల్ పై ఉన్న క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేసినట్లయితే ఆ సీసా ఎక్కడ తయారైంది ఏ డిపో నుండి సరఫరా చేయబడింది, ఏ షాపులో మీరు కొనుగోలు చేశారో వంటి వివరాలు తెలుస్తాయని తెలిపారు.